శ్రీ ప్రకాష్‌లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బోగిమంటలు, సాంప్రదాయ వంటకాలు, గొబ్బెమ్మలు, రంగుల ముగ్గులు, హరిదాసుల మధ్య విద్యార్థినుల ఆటపాటలతో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎం.వి.ఆర్ పూజలు

విశాలాంధ్ర - అనకాపల్లి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఎం.వి.ఆర్ దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయంలోని ముక్కోటీ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బొల్లిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ దళితుల మధ్య చిచ్చు పెట్టడమే

- భీమ్ సేన వ్యవస్థాపకులు రవి సిద్ధార్థ్

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎస్సీ వర్గీకరణ దళితుల మధ్య చిచ్చు పెట్టడమే అని భీమ్ సేన వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు రవి సిద్ధార్థ్ ఆరోపించారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతూ పాయకరావుపేట భీమ్ సేన నాయకులతో చర్చలు జరిపారు. రాష్ట్రంలో దళితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డగోలుగా 59 కులాల మధ్య చిచ్చు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను నీరు కార్చాలని కొంతమంది మనువాదులు దళితులను అంటరాని వారిగా చూస్తున్నారని అన్నారు. ఇందులో భాగమే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కుట్రని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భీమ్ సేన ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి నెలపర్తి అర్జున్, జిల్లా గౌరవ అధ్యక్షులు ముక్కుడుపల్లి దాసు, జిల్లా కార్యదర్శి ముక్కుడుపల్లి నాగరాజు, పట్టణ అధ్యక్షులు గుల్లా శివ, మండల అధ్యక్షులు పెయ్యా నానాజీ, మండల గౌరవ అధ్యక్షులు ఏనుగుపల్లి అప్పారావు, ముక్కుడుపల్లి రాజు, గారా రవి, చిలుకూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ క్రికెట్లో కప్ పోటీల్లో జర్నలిస్ట్ టీం విజయం

విశాలాంధ్ర - అనకాపల్లి: ఎంపీ సీఎం రమేష్ కప్ పేరిట నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రీడ పోటీల్లో అనకాపల్లి జర్నలిస్ట్ టీం విజయం సాధించింది. శుక్రవారం అరవింద్ టీం లెవెన్ టీంతో జరిగిన మ్యాచ్లో 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన అరవింద్ టీం 8 ఓవర్లకు 89 రన్స్ చేశారు. జర్నలిస్ట్ టీం 6 ఓవర్లలో రన్స్ కొట్టి విజయం సాధించింది. విజయం పట్ల క్రీడ అభిమానులు జర్నలిస్ట్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా వైకుంఠ ఏకాదశి

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం ఎస్.రాయవరం గ్రామంలోని వైకుంఠ ఏకాదశి సందర్భంగా వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుండి భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు దర్శించుకున్నారు. అనంతరం సాయంత్రము స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, మాజీ ఎంపీటీసీ కొణతాల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్వాన్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - కోటవురట్ల: మండల కేంద్రంలో ఉన్న శ్రీ విద్వాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం అత్యంత వైభవంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. స్కూల్ కరస్పాండెంట్ హరనాద్, ప్రిన్సిపాల్ ఫణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్కూల్ ప్రాంగణంలో ముగ్గులు వేసి, మామిడి ఆకులు పూల మాలలతో తోరణాలు కట్టి సుందరంగా అలంకరించారు. విద్యార్థుల చేత రంగవల్లులు, గొబ్బెమ్మలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. స్కూల్ లో వేసిన భోగిమంటలు చుట్టూ ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు చేరి సందడి చేశారు. ఆడపిల్లలు చీరకట్టు, మగ పిల్లలు పంచకట్టు ధరించి ఆటపాటలతో అలరించడం ఎంతగానో ఆకట్టుకున్నాయి. హరిదాసు వేషధారణలు వేసి సంక్రాంతి సంబరాలను ఉత్సాహంతో అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు.

జూట్ ఆధారిత ఉత్పత్తులను వినియోగించాలి

- డిఎస్ఎన్ఎల్‌యు విసి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

విశాలాంధ్ర - సబ్బవరం: పర్యావరణ పరిరక్షణకు జూట్ ఆధారిత ఉత్పత్తులను వినియోగించాలని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయం కార్యాలయ ఆవరణలో పెరికే ఫౌండేషన్ ఆధ్వర్యంలో తయారుచేసిన జూట్ బ్యాగులను సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంనిషేధించాలని ప్రభుత్వం నిర్ణయించిందని దానికి అనుగుణంగా మనమంతా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పాలిథిన్ ఉత్పత్తులు తయారు చేయుటలో ఉపయోగించే రసాయనాల వల్ల మానవాళికి పలు వ్యాధులు సంక్రమించడంతోపాటు ఆరోగ్యానికి కూడా హానికరమని పేర్కొన్నారు. ఎటువంటి హానికరము లేని జూట్ ఉత్పత్తులు తయారు చేస్తున్న పెరికే ఫౌండేషన్ చైర్మన్ పెరికే వరప్రసాదరావును వీసీ సూర్యప్రకాశరావు అభినందించారు.అంతకు ముందు వరప్రసాదరావు మాట్లాడుతూ మనం వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్ల వల్ల భూమి లోపల ఉండే భూసారం కోల్పోవడమే కాకుండా భూగర్భజలాలు తగ్గిపోతాయని తెలియజేశారు. అంతేకాకుండా 21 రకాల క్యాన్సర్ లు రావడానికి కూడా ఈ ప్లాస్టిక్ వినియోగం దోహదపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుచేత ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండి జ్యూట్ ఉత్పత్తులు వాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, పిఎస్ టు రిజిస్ట్రార్ ఏ. గోపి, జేఏఓ సుదర్శన్, కార్యాలయ సిబ్బంది మురళి, వెంకటేష్, సంధ్య పాల్గొన్నారు.

ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయానికి ప్రహరీ నిర్మాణం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయం ప్రహరీకి ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు నిధులు రూ.2 లక్షలతో ఏర్పాటు చేస్తున్న పనులకు మాడుగులకు చెందిన సాలూరు బాబా కృపానిది, భారతి దేవి దంపతులు ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు, పడాల అప్పలనాయుడు, రాయపురెడ్డి కొండలరావు, పడాల వెంకటరాజు, పోతిన జగదీష్, మజ్జి యేసు, గాడి కొండలరావు, గొల్లవిల్లి కృష్ణ, ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి మేలుకొలుపుల సమ్మేళనం

విశాలాంధ్ర - రాంబిల్లి: మండల కేంద్రమైన రాంబిల్లి రామాలయం, వెంకయ్యపాలెం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాలలో ఉదయం మేలుకొలుపుల బృందాలతో శుక్రవారం సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సమ్మేళనంలో 10 గ్రామాల నుండి మేలుకొలుపుల బృందాలు నుండి సుమారు 950 మంది పాల్గొన్నారు. దీనితో హరినామ స్మరణతో ఆలయాలు మారుమ్రోగాయి. కార్యక్రమంలో భాగంగా సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి సబ్ డివిజన్ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు, మండల కన్వీనర్లు సూరాడ నూకరాజు, చింతకాయల గగన్ కుమార్ పాల్గొన్నారు. మేలుకొలుపులు ధనుర్మాసంలో ఎందుకు చేయాలి, దాని వలన ఉపయోగాలు గురించి, ఎస్ఎస్ఎఫ్ ద్వారా జరుగుతున్న పనులు, జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న మేలుకొలుపు ముగింపు కార్యక్రమాలు గురించి తెలియజేసారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ ప్రసాదం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాడనరసాపురం, గోవిందపాలెం, కొత్తపేట, చిన్న కలవలాపల్లి, కొండవారిపాలెం కొత్తపట్నం, యాతకొత్తపట్నం గ్రామాల మేలుకొలుపులు బృంధాలు, భజన బృందాల గురువులు పాల్గొన్నారు.

రామాలయం పునఃనిర్మాణానికి రూ.50 వేలు విరాళం

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో శ్రీ కోదండ సీతారామ ఆలయం పునః నిర్మాణానికి ఆదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సబ్బవరం ఎంపిటిసి- 2 బైలపూడి దేముడు రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని శుక్రవారం ఆలయ కమిటీ నిర్వాహకులు బోకం రామనాయుడు, బండారు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా బైలిపూడి దేముడుకి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, బైలిపూడి సత్యం, బైలపూడి శ్రీరాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిక్వెస్ట్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలి

- పాములవారి నివాసితులు విజ్ఞప్తి

విశాలాంధ్ర - చోడవరం: మండలంలోని వెంకన్నపాలెం పంచాయతీ శివారు పాములవారి నివాసాల వద్ద ఆర్టీసీ రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అనకాపల్లి - చోడవరం బి. ఎన్. రహదారిని ఆనుకొని సుమారు 150 కుటుంబాలు, అంబేరుపురం పరిధిలో 50 కుటుంబాలు నివాసం ఉంటున్నారు.

పాములు వారి నివాసాలు వెంకన్న పాలెం పంచాయితీ పరిధిలో ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు ఎక్కాలంటే కనీసం కిలోమీటరున్నర దూరం, గోవాడ జంక్షన్‌కు వెళ్లాలన్నా కిలోమీటర్ నడవాల్సిందేనని తెలిపారు. దీనివలన తరచూ ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రాత్రి సమయాలలో బస్సులు ఆపకపోవడంతో మహిళలు, వృద్ధులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని తెలియజేశారు. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయవలసిందిగా వారు కోరుతున్నారు.

వెంకన్నపాలెం గ్రామ సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు వివరణ

పాములు వారి కుటుంబాలు ఆర్టిసి బస్సుల కోసం పడుతున్న అవస్థలను తక్షణమే స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఆర్టీసీ బస్సులు ఆపేందుకు, రిక్వెస్ట్ స్టాపు ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులతో మాట్లాడి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ, ఆదిరెడ్డిపాలెం గ్రామంలో రామాలయం దరి కోటాన కిష్టమ్మ ఇంటి నుండి గండి కనకాలు ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. ఎంపీటీసీ బైలిపూడి దేముడు విన్నపం మేరకు ఎంపీపీ బోకం సూర్యకుమారి మండల ప్రజా పరిషత్ నిధులు రూ.5 లక్షలు సీసీ రోడ్డు నిమిత్తం మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీపీ బోకం సూర్య కుమారి, ఎంపీటీసీ బైలపూడి దేముడు, గ్రామ పెద్దలు కొబ్బరికాయ కొట్టి సిసి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించడంతో స్థానిక గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, స్థానిక నాయికులు ఆదిరెడ్డి రమణ, కోటాన అప్పారావు, ఆదిరెడ్డి పోతరాజు, కోటాన కోటేశ్వరరావు, కామరెడ్డి ముత్యాల నాయుడు, బైలపూడి సత్యం, గండి కనకాలు తదితరులు పాల్గొన్నారు.

పండగకు ఊరెళ్తున్నారా...తస్మాత్ జాగ్రత్త

సీఐ అల్లు స్వామి నాయుడు

విశాలాంధ్ర - కశింకోట: సంక్రాతి పండగకి ఊరికి వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక సీఐ అల్లు స్వామి నాయుడు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక సీఐ మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంక్రాతి పండుగ సెలవులను పురస్కరించుకొని సొంత ఊరికి వెళ్లాల్సి వస్తే వారు విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదు అని తమతో పాటే తీసుకెళ్లాలని సెలవుల్లో బయటికి వెళుతున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంట్లో ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని, తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వండి అన్నారు. వివరాలు నమోదు చేసుకొని వారి ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తాం అని అన్నారు. మీ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలని ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వెయ్యడం మంచిదన్నారు.

నమ్మకమైన వ్యక్తులను మాత్రమే వాచ్ మెన్ సెక్యూరిటీ గార్డ్ సర్వెంట్‌గా నియమించుకోవాలని మీ ఇంట్లో సీసీ కెమారాలు పెట్టినట్లు అయితే దాని ద్వారా ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు మొబైల్‌లో మీ ఇంటిని పరిసర ప్రాంతాలను లైవ్‌లో ప్రత్యేక్షంగా చూసుకొవచ్చు అన్నారు. ఊరికి వెళున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించాలని చెప్పాలన్నారు. ఎట్టి పరిస్థితులలో సోషల్ మీడియాలో మీ లొకేషన్, ట్రావెల్స్ ప్లాన్స్, ఎప్పుడు ఎక్కడికి వెళ్తున్నాం అనే మీ అప్డేట్స్ పెట్టవద్దు అన్నారు. ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకి, డయల్ 100కి సమాచారం అందించాలి అని అన్నారు. కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ప్రజలు పోలీస్ శాఖ వారి సూచనలు పాటిస్తూ, సహకరిస్తే చోరీలను నియంత్రించడం సులభం అవుతుంది అని తెలిపారు.

మైనర్ బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడు అరెస్ట్

పరవాడ డి.ఎస్.పి కె.వి.సత్యనారాయణ

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని అక్టోబర్ 19వ తేదీన అదృశ్యమైన ఓ మైనర్ బాలిక ను కిడ్నాప్ చేసిన నిందితున్ని శుక్రవారం పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేసినట్లు పరవాడ డిఎస్పీ కె వి సత్యనారాయణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్టోబర్ 19న మైనర్ బాలిక అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు అక్టోబర్ 20న సబ్బవరం పోలీస్ లకి ఫిర్యాదు చేశారని,ఈ మేరకు సబ్బవరం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.మైనర్ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో, బాలిక తల్లిదండ్రులు పరవాడ రోడ్డు గుంతలు పూడ్చే కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రికి కలిసి ఫిర్యాదు చేసారని, దీంతో హెూం మంత్రి, డిఎస్పి,డిఐజి ఉన్నతాధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారన్నారు. బాలికను అదే గ్రామంలో జెసిబి డ్రైవర్ గా పనిచేస్తున్న పతివాడ మహేష్ (26) పరిచయం చేసుకున్నాడు. దీంతో బాలికను కిడ్నాప్ చేసి పల్సర్ బైక్ పై తీసుకెళ్లట్లుగా పోలీసులు దర్యాప్తులో తేలినట్లు తెలిపారు. మైనర్ బాలిక కిడ్నాప్ కు బాలిక పిన్ని కొడుకు సహకరించాడని దర్యాప్తు లో తెలిందని పోలీసులు తెలిపారు.అయితే ఈ నెల 10న శుక్రవారం నిందితుడు పతివాడ మహేష్ అసకపల్లి జంక్షన్ వద్ద ఉన్నట్లు సమాచారం గుర్తించి పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు . నిందితుడు బాధితురాలు మైనర్ బాలిక ను, పెళ్లి చేసుకున్నట్లు, శారీరకంగా అనుభవించినట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. బాధితురాలు బాలికను మెడికల్ టెస్టుకు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. నిందితుడుపై ప్రోహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006,పోక్సో కేసు, అత్యాచారం కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పరవాడ డి. ఎస్. పి కెవి సత్యనారాయణ తెలిపారు. రెండో నిందితుడయిన మైనర్ బాలిక పిన్ని కొడుకు కోసం గాలించినట్లు తెలిపారు.

మంచాల మోడల్ జాతీయ స్థాయి గుర్తింపు

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని మంచాల మోడల్ పాఠశాలకు మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతియేటా జాతీయ స్థాయిలో సెంటర్ ఫర్ సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ ఎన్విరాన్మెంటల్ డెవలప్మెంట్ న్యూ ఢిల్లీ వారు నిర్వహించే గ్రీన్ స్కూల్స్ ఆడిట్‌లో ఏపీ మోడల్ స్కూల్ 2024-25 సంవత్సరానికి గాను పాఠశాలలో అనుసరిస్తున్న సుస్థిర పర్యావరణ హిత కార్యక్రమాలకు గుర్తింపుగా వరుసగా రెండవసారి గ్రీన్ స్కూల్ సర్టిఫికేషన్‌కు ఎంపికైందన్నారు. రాష్ట్ర స్థాయిలో 16 పాఠశాలలు ఎంపిక కాగా విశాఖ, అనకాపల్లి జిల్లాల నుండి మంచాల మోడల్ స్కూల్ ఏకైక పాఠశాలగా ఎన్నికవ్వడం గర్వకారణమన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన న్యూ ఢిల్లీలో జరిగే అవార్డు ప్రధాన కార్యక్రమం సియస్‌సి వారు ఈ అవార్డును ప్రధానం చేయనున్నారని తెలిపారు. పాఠశాలకు ఈ అవార్డు రావడం పట్ల పలువురు అభినందించారు.

అలివిర యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ

విశాలాంధ్ర - పరవాడ: ఎస్ఈజెడ్‌లోని అలివిర యూనిమల్ హెల్త్ లిమిటెడ్ పరిశ్రమలో హెల్పర్‌గా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు జిహాన్ అన్సర్(21) పొట్టపై బుధవారం డయా మిథైల్ సల్ఫేడ్ రసాయం పడతంతో భారీ పొక్కులు ఏర్పడ్డాయి. దీంతో ఆ కార్మికున్ని అగనంపూడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం జాయిన్ చేశారు. కాగా ఈ విషయాన్ని యాజమాన్యం గోప్యంగా ఉంచడమే కాకుండా తమ పరిశ్రమలో ఏమీ జరగలేదని బుకాయిస్తూ వచ్చారు. తమకు ఏమాత్రం సంబంధం లేదంటూ చెప్పుకొచ్చారు. విషయం తెలుసుకున్న సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పోలీస్, రెవెన్యూ అధికారులకు తెలియచేయకుండా గోప్యంగా ఉంచడం దుర్మార్గం అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. గాయపడ్డ కార్మికుడికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్మికుడికి ఈఎస్ఐ పిఎఫ్ అమలు చేస్తున్నారా లేదా, వలస కార్మికుల చట్టం అమలు చేస్తున్నారా లేదా అనే విషయాలపై అధికారులు సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

హెరిటేజ్ డెయిరీ సేవలు భేష్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: హెరిటేజ్ డెయిరీ పాడిరైతులకు అందుబాటులో సేవలు అందించడం అభినందనీయమని గ్రామ టిడిపి బూత్ ఇంచార్జ్ కొల్లి సన్నిబాబు (మాస్టర్) అన్నారు. శుక్రవారం మండలంలో దొప్పెర్ల శివారు రాయగరువు గ్రామంలో ఏర్పాటు చేసిన హెరిటేజ్ నూతన పాలసేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్నా పాడిరైతులకు సంవత్సరానికి రెండుసార్లు బోనస్ ఇస్తున్నామని, ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని డెయిరీల కంటే పాలుకు అధిక ధర చెల్లిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ పిఆర్ కె.వెంకట్రావు, కె.వరలక్ష్మి, కె.దేవి, పి.రవణమ్మ, ఎం.సన్యాసిరావు, కె.నాగరాజు తదితర పాడిరైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఉత్తర ద్వార దర్శనాలు

- బారులు తీరిన భక్తులు

విశాలాంధ్ర - యలమంచిలి: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని శుక్రవారం నాడు వైష్ణవ ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. ఈ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నాను. యలమంచిలి పట్టణంలో వీరన్న కొండమీద ఉన్న వెంకటేశ్వర స్వామి, కొత్తపేట రామాలయం, బస్టాండ్ సమీపంలో కదా ఆంజనేయస్వామి గుడి వద్ద గల వెంకటేశ్వర స్వామి ఆలయం, తులసీ నగర్ రామాలయం, పాత వీధి రామాలయం, కొత్తపాలెం రామాలయం, మండలంలో పలు గ్రామాల్లో రామాలయాలు వెంకటేశ్వర ఆలయాల్లో భక్తులకు భగవంతునికి దర్శన భాగ్యం కలిగింది. సందర్భంగా ఆలయాల్లో భక్తుల గోత్ర నామాలతో పాటు ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు అందజేశారు. కొన్ని దేవాలయాలు వద్ద అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మునగపాక: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విజన్ మేరకు శనివారం యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో భాగంగా యలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యులు సభ్యులు సుందరపు విజయ్ కుమార్ పాల్గొననున్నారు. మునగపాక మండలంలో వివిధ గ్రామ పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన పలు రోడ్లు, డ్రైన్లు, గోకులం షెడ్లు, సోలార్ తదితర కార్యక్రమాలు ప్రారంభిస్తారని మండల టీడీపీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. మధ్యాహ్నం 2:00 గంటలకు నాగవరం పంచాయతీ 2:30 గంటలకు రాజుపేట పంచాయతీ, మధ్యాహ్నం 3:00 గంటలకు నారాయుడుపాలెం పంచాయతీ చిన్నోడు పాలెం, 3:30 గంటలకు టీ సిరసపల్లి పంచాయతీ, సాయంత్రం 4:00 గంటలకు తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి, సాయంత్రం 4:30 గంటలకు ఉమ్మలాడ పంచాయతీలలో పర్యటిస్తారని తెలిపారు.

కావున మండలంలోని కూటమి నాయకులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసు దాడి

విశాలాంధ్ర-రాంబిల్లి: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి, పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. శుక్రవారం నాడు రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి 4 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 8,100ల నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు రాంబిల్లి ఎస్సై నాగేంద్ర తెలిపారు.

జాతీయ మానవ హక్కుల సంస్థ కౌన్సిల్ చైర్మన్ గా దేవరపల్లి నవకుమార్ నియామకం

విశాలాంధ్ర-చోడవరం: చోడవరం, మాడుగుల జాతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (భారత ప్రభుత్వం ఆమోదించిన సంస్థ)లో సీనియర్ జర్నలిస్ట్ దేవరపల్లి నవకుమార్ ను నియమించినట్లు జాతీయ మానవహక్కుల కౌన్సిల్ చైర్మన్ పి.సంపత్ కుమార్ శుక్రవారం తెలిపారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గ పరిధిలో గల చోడవరం, బుచ్చయ్య పేట రావికమతం, రోలుగుంట, మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి, కె. కోటపాడు మండలాలకు ఎన్.హెచ్.ఆర్.సి చైర్మన్ గా వ్యవహ రిస్తారని జాతీయ మానవహక్కుల కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ పి. సంపత్ కుమార్ తెలిపారు. రెండు సంవత్సరాలు పాటు ఈ పదవిలో కొనసాగుతారన్నారు. రాజ్యాంగబద్ధమైన మానవ హక్కులను కాపాడుతూ, నిరుపేదలు కూలీ సంఘాలకు అండగా వుంటూ సక్రమముగా పనిచేసే విధముగా ఉంటారన్నారు. మహిళా సాధికారిత, సామాజిక న్యాయం, చిల్డ్రన్ కేర్ ప్రొటెక్షన్, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు కాపాడుతూ చట్ట పరిధిలో అందరూ సమానమే అనే నినాదం ను అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నాణ్యత గల విద్య, ఆహారం, ఆరోగ్యం అందించడం, హింస నేర ప్రవృత్తి ని ప్రోత్సహించకుండా, స్వేచ్ఛగా జీవించే హక్కులను కాపాడుతూ యువత ను చక్కటి మార్గాల్లో నడిపించడం, జంతువుల పట్ల క్రూరత్వం అరికట్టే విధముగా వ్యవహరించడం, సమాజవిలువల పెంపుకొరకు కౌన్సెలింగ్ ఇవ్వడం, ప్రకృతి సాధికారిత కాపాడడం అందరి బాధ్యతగా చాటి చెప్పడం, ప్రభుత్వం మరియు ప్రభుత్వయేతర ఉద్యోగుల హక్కులు కాపాడు విషయాలల్లో ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కులు సాధించే దిశగా ఈ సంస్థ పని చేస్తుందన్నారు. రాజ్యాంగ విరుద్ధముగా, చట్ట విరుద్ధముగా పని చేసేవారిపై పోరాట ధోరణి ఉంటుందన్నారు. సంస్థ చేపడుతున్న ఉద్దేశ్యాలు, లక్ష్యాలు కొరకు సహకరించాలని పిలుపు నిచ్చారు. సేవ సహకారాలు అందించడం లో అందరికి అందుబాటులో ఉంటామన్నారు. ఎన్. హెచ్.ఆర్.సి చైర్మన్ గా ఎన్నికైన సీనియర్ జర్నలిస్ట్ దేవరపల్లి నవకుమార్ ను చోడవరం ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ తో పాటు పలువురు పత్రికా అభినందనలు తెలియజేశారు.

కళాకారులకు రాంకీ ఫౌండేషన్ వితరణ

విశాలాంధ్ర-పరవాడ : విశాఖ ఫార్మాసిటీ హబ్ లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న పెదతాడి కోలాటం బృందానికి రాంకీ ఫౌండేషన్ చీరలు, కోలాటం కర్రలు, భజన బృందానికి సౌండ్ బాక్స్, యమహా మ్యూజిక్ సిస్టం, డోలక్, భజన తాళాలను అందజేసారు. ఈ సందర్భంగా కళాకారులను ఉద్దేశించి విశాఖ ఫార్మా సిటీ మెనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి లాల్ కృష్ణ మాట్లాడారు. భారతీయ కళలు మరుగుపడుతున్న ఈ రోజుల్లో తాడి గ్రామస్తులు ప్రాచీన కలలైన భజన, కోలాటం నృత్యాలను సాధన చేసి ప్రదర్శించటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కలలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయి అన్నారు. విశాఖ ఫార్మాసిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఓఓ) మోదుగుల వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ తాడి కళాకారుల స్ఫూర్తితో మిగిలిన గ్రామాలకు కూడా ప్రాచీన కళలు సాధన చేసి ఆ కలలు మరుగున పడకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోలాటం కళాకారులకు చీరలు, సంక్రాంతి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫార్మాసిటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గిరిధర్ బక్షి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి. రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ కె.శ్రీకాంత్, విశాఖ ఫార్మాసిటీ అధికారులు, రాంకీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

డావిన్సీలో క్రీడా సాంస్కృతిక ఉత్సవ్ ప్రారంభం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో ఉన్న డావిన్సీ అంతర్జాతీయ పాఠశాల నందు రెండు రోజులపాటు జరగనున్న క్రీడా సాంస్కృతిక ఉత్సవ్ 2025 శుక్రవారం ప్రారంభమైంది. క్రీడాజ్యోతి ప్రజ్వలనను డాక్టర్. జి. రామమూర్తి 78వ కార్పొరేటర్ బి. గంగారావు , మంగ లక్ష్మి , కృష్ణారావు గ్రామ సర్పంచ్ విద్యార్థి వెంకటరావు, డాక్టర్ కాండ్రేగుల యశ్వంత్ కుమార్ డాక్టర్, లోకేష్ ,కేఎస్.వి.సత్యనారాయణ , ఎం.ఆర్.వి అప్పారావు, తమ్మి రాజు చేశారు. ముందుగా క్రికెట్ మ్యాచ్ తదుపరి కోకో జూనియర్స్ బాస్కెట్బాల్ జూనియర్ ,సీనియర్ అథ్లెటిక్స్ ,రన్నింగ్ లాంగ్ జంప్, స్కేటింగ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులే కాకుండా చుట్టుపక్క గ్రామాల వారు కూడా భారీగా తరలివచ్చి వీక్షించారు. మొదటి రోజు అద్వితీయంగా జయప్రదం చేస్తారు. తల్లిదండ్రులకు మంట లేని వంట కార్యక్రమం ద్వారా రుచికరమైన వంటలు వారితో తయారు చేయించి గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. ఎండి కర్రీ సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ, ప్రిన్సిపల్ మీనా మిశ్రా స్కూలు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురజాడ పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-అనకాపల్లి: పట్టణంలో రింగ్ రోడ్ లో గల డాక్టర్ ఎం.వి.వి సత్యనారాయణ మెమోరియల్ గురజాడ పబ్లిక్ స్కూల్ నందు శుక్రవారం సంక్రాంతి సంబరాలు కోలాహలంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా అలరించారు. పాఠశాల ప్రాంగణంలోని క్రీడా మైదానంలో తోరణాలు , గాలి పటాలతో , చెఱుకు గడలు , మామిడి తోరణాలతో పల్లె వాతావరణంతో పండుగ శోభ తీసుకొచ్చారు. భోగి మంటలతో వేడుకలకు నాంది పలికారు. పొంగళ్ళు తయారు చేసి సూర్యభగవానుడికి నైవేద్యం పెట్టారు. మరికొందరు విద్యార్థులు ఆకర్షణీయమైన రంగవల్లు లతో సంక్రాంతికి ఆహ్వానం పలికారు. చిన్నారులు వేసిన హరిదాసు , సోదఅమ్మ , గంగిరెద్దుల వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.పలువురు విద్యార్థులు సంక్రాంతి పాటలతో చేసిన నృత్యాలు ఎంతగానో ఆకర్షించాయి. విద్యార్థులు నోరూరించే తెలుగు వంటకాలను రుచి చూపించారు. అనంతరం భోగి మంటలు వేసి భోగి చుట్టూ విద్యార్థినిలు విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణతో సందడి చేశారు.అనంతరం కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి జ్యోతి మాట్లాడుతూ ఈ ఏడాది సంక్రాంతి వేడుకలు చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ముక్కోటి ఏకాదశి రోజున వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషమని అలాగే వెంకటేశ్వర స్వామి నూకాంబిక అమ్మవారి అనుగ్రహంతో విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని వివరించారు. పండుగలు సాంస్కృతిక వైవిధ్యం గురించి ఎంతో నేర్పుతాయన్నారు. ఈ సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో బలమైన బంధాలు ఏర్పడి కలతలను దూరం చేసే అనుబంధాల వేడుక అని తెలియజేసారు.కార్యక్రమంలో పాఠశాల ఆఫీస్ సిబ్బంది , ఉపాధ్యాయులు , విద్యార్థులు , విద్యార్థినిలు పాల్గొని గురజాడ సంక్రాంతి సంబరాలు విజయవంతంగా నిర్వహించారు.

వాసవి క్లబ్ సబ్బవరం రూరల్, వాసవి క్లబ్ కపుల్స్ సబ్బవరం నూతన కార్యవర్గం ఎన్నిక

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని ఇరువాడ శివాలయం వద్ద శుక్రవారం ఇంటర్నేషనల్ గవర్నర్(డిస్ట్రి 216 ఎ కె .పార్వతి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ సబ్బవరం రూరల్, మరియు వాసవి క్లబ్ కపుల్స్ సబ్బవరం ఈ రెండు క్లబ్ ల ఏకగ్రీవ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. వాసవి క్లబ్ సబ్బవరం రూరల్ ప్రెసిడెంట్ గా దంగేటి సంతోష్ గుప్త, సెక్రెటరీ డి. సన్యాసిరావు, ట్రెజరర్ ఎన్. సతీష్ అలాగే 40 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అలాగే వాసవి క్లబ్ కపుల్స్ సబ్బవరం ప్రెసిడెంట్ గా పి. వెంకటేష్ (వెంకి మొబైల్ షాప్), సెక్రటరీ పి. వెంకటేష్, ట్రెజరర్ పి. రామకృష్ణ మరియు 30 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైనా ఈ రెండు క్లబ్ ల ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ లను వారు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ విద్యా సంకల్ప కేసిజియఫ్ శ్రేయోభిలాషి, వాసవి దాత, ఇంటర్నేషనల్ ఎడిషనల్ ట్రెజరర్ పి.ఎస్.వరహాలరావు, రీజనల్ చైర్మన్ జే.పాణి, జోన్ చైర్మన్ డివిఎస్ రామారావు, క్యాబినెట్ టీం, వాసవి క్లబ్ సబ్బవరం రూరల్ ట్రస్ట్ సభ్యులు, వాసవి క్లబ్ కపుల్స్ సబ్బవరం ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్ లో కార్మికుల బకాయిలు చెల్లింపులో యాజమాన్యం మొండి వైఖరి నశించాలి..

సుగర్స్ కార్మికులు ఆకలి కేకలుయాజమాన్యానికి ప్రజాప్రతినిధులకు వినిపించవా ?

కార్మికులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె. భాస్కరరావు

విశాలాంధ్ర-చోడవరం : జనవరి 10, చోడవరం కో ఆపరేటివ్ షుగర్స్ (గోవాడ) లో వేతన బకాయిలు వేతనాలు తక్షణమే చెల్లించాలని కార్మికులు శుక్రవారం ఎండి చాంబర్ వద్ద ఆందోళనకు దిగారు. కార్మికులు ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు , కె.భాస్కరరావు ఆధ్వర్యంలో జరిపిన ఆందోళన లో కార్మికుల కుటుంబాల ఆకలి కేకలు యాజమాన్యానికి ప్రజాప్రతినిధులకు వినిపించ లేదా అని ప్రశ్నించారు. కార్మిక నేత భాస్కరరావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు బకాయి ఉన్న కార్మికుల జీతాలు మరియు ఇతర బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. గడిచిన నెల రోజులుగా అనేక పర్యాయములు ఫ్యాక్టరీ ఎండి కార్మికుల బకాయిలు సంక్రాంతి పండగ ముందు చెల్లిస్తామంటూ ఇచ్చిన హామీ నిలబెట్టు కోనందుకు నిరసనగా నిరసనకు దిగినట్లు తెలియజేశారు. కార్మికుల ఆకలి కేకలు ఫ్యాక్టరీ యాజమాన్యానికి ప్రజా ప్రతినిధులకు పట్టవా అని ప్రశ్నించారు. తక్షణమే బకాయిలు చెల్లించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో కార్మికులు జరిపే తీవ్ర ఆందోళనలకు ఫ్యాక్టరీ యాజమాన్యమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

12న పల్లెపండగ కార్యక్రమం

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని ఈనెల 12న పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో పి.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమానికి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఆమె తెలిపారు. మండలంలోని బోదువలస, ఎల్లుప్పి, తవ్వవానిపాలెం గ్రామాలలో పల్లె పండగ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు.అలాగే గోకులం షెడ్లు ప్రారంభం, వరి దాన్యం సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని కోరారు.

హరి నామస్మరణతో మారుమ్రోగిన వైష్ణవ క్షేత్రాలు

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు ...

విశాలాంధ్ర-చోడవరం : జనవరి 10, వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం చోడవరం పరిసర గ్రామాల్లో వైష్ణవ క్షేత్రాలన్నీ హరినామ స్మరణతో మారు మ్రోగాయి. ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు, ప్రముఖులు వేకువజామునండి పోటెత్తారు. చోడవరం లోని పురాతన శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామి ఆలయం, ఆపదహర శ్రీనివాస క్షేత్రం, గోవాడ వెంకటేశ్వరుని ఆలయం, లక్కవరం భూపతి వెంకటేశ్వరుడు, తదితర వైష్ణవ క్షేత్రాలన్నింటి లో స్వామి వారి దివ్య దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆపదహర శ్రీనివాస క్షేత్రంలో స్వామివారు గరుడ వాహనంపై దర్శనం ఇచ్చారు. ఉత్తర వైకుంఠ ద్వారంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవుడు భక్తకోటికి దర్శన భాగ్యాన్ని కల్పించారు. వేకువజాము నుండి శ్రీదేవి, భూదేవి సమేత స్వామివార్లకు పురుష సూక్త విధానంలో పంచామృత అభిషేకములు, వివిధ ఫలాలు పుష్పాలతో దేదీప్యమానంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో చోడవరం ఆపదహర శ్రీనివాస క్షేత్రం చైర్మన్ వింజమూరి శంకర్, ఉపాధ్యాయుల శ్రీనివాస్, గోవాడ సుగర్స్ ఎండి వివిఎస్ నాయుడు తదితర ప్రముఖులు, భక్తులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ విద్యాలయంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని స్థానిక ప్రతిభా విద్యాలయంలో సంక్రాంతి పండగ సందర్భంగా ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డూ డూ బసవన్న గంగిరెడ్డి విన్యాసాలు,రంగవల్లులు, భోగి మంటలు, భోగి పళ్ళు పోయుట, గాలిపటాలు ఎగరవేయడం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో అందరిని అలరించారు. ఈ సందర్భంగా ప్రతిభ కరస్పాం డెంట్ ఆదిరెడ్డి రమణ మాట్లాడుతూ కనుమరుగుతున్న తెలుగువారి సాంప్రదాయ పండుగలను పాఠశాలలో నిర్వహించి విద్యార్థులకు తెలియజేయడం జరుగుతుంద న్నారు. తెలుగుదనం ఒట్టిపడేలా సాంప్రదాయ దుస్తులు ధరించడం, సాంప్రదాయ సంస్కృతులను ప్రదర్శించి సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆన్సీ జోసెఫ్, డైరెక్టర్స్ ఆదిరెడ్డి శరత్ తేజ్, విష్ణు తేజ్, ప్రధానోపాధ్యాయులు కనక మహాలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.